# A comprehensive IAS Guide /cracker/motivator intended for Rural and urban aspirants





## కోరం కిషోర్
**IRAS**







సివిల్స్, గ్రూప్స్, రాసే
ప్రతి ఒక్కరూ చదివితీరాల్సిన
చక్కని 'సామాజిక నవల'.

## కిట్టుగాడు
# ఇంటర్ ఫెయిల్, ఐ.ఏ.ఎస్. పాస్

# కిట్టుగాడు. . . ఇంటర్ ఫెయిల్,

# ఐ. ఏ. ఎస్ పాస్

(నవల)

## రచన : కోరం కిశోర్

IRAS


చిరునామా :

కోరం కిశోర్

IRAS

బంగ్లా నెం. 305, ప్రకాశం రోడ్,

సౌత్ లాలాగూడ, సికింద్రాబాద్ - 500 017.

ఫోన్ : 97013 70113

E- mail : kishorengland@yahoo.com

# కిట్టుగాడు. . .  ఇంటర్ ఫెయిల్... ఐ.ఏ.ఎస్ పాస్

కిట్టూ. . . కిట్టూ  . . . ఓ. . .  కిట్టూ .. . . పెద్ద గొంతుకతో ఊరంతా అరుపులు వినబడుతున్నాయి.

కిట్టూ. . . ఓ కిట్టూ. . . .

ఇసుక నేలపై కూర్చుని 'దూదుంపుల్లాట' ఆడుతున్నాడు కిట్టు.

అది సాయంత్రం ఏడు గంటలు. . .

ఆ సమయంలో, స్నేహితులతో, వీధిలైటు వెలుతురులో ఆటలో మునిగి ఉన్నాడు కిట్టు.

ఒరేయ్ ! మీ నాయనమ్మ పిలుస్తుందిరా . . . అన్నాడొకడు.

ఆ. . .  ఇనబడింది. . . ఇంకోసారి ఆడి, ఎల్తాను అన్నాడు కిట్టు.

'దూదుంపుల్లాట' లో ఇసుకని సన్నగా, పొడవుగా, ఒక మనిషి మోచేయి కంటే ఎక్కువ పొడవుగా రెండు అరచేతులతో పోగు చేస్తారు. ఒక చిన్న ఈనె పుల్లని ఒకడు ఎదుటివాడికి కనబడకుండా ఆ ఇసుకలో దాస్తాడు. రెండో ఆటగాడు తన రెండు చేతి వేళ్లనీ ఒకదానిలో ఇంకొకటి దూర్చి, ఆ ఈనె పుల్ల ఎక్కడ ఉందనుకుంటాడో అక్కడ వేయాలి. సరిగ్గా పుల్ల ఉన్న చోట వేస్తే వాడు నెగ్గినట్టు.  . . . లేకపోతే మళ్ళీ ప్రయత్నించాలి. అలా ఆట నడుస్తూ ఉంది. . . .

ఇంతలో కిట్టుని వెతుక్కుంటూ, నాయనమ్మ రానే వచ్చింది.

ఏంట్రా . . . . .

ఇందాకట్నుంచి, నోరు పడిపోయేటట్టు అరుస్తూనే ఉన్నాను. . . . . ఉలక్కుండా, పలక్కుండా నీ దారిన నువ్వు ఆడతానే ఉన్నావు. అన్నం తినకుండా ఆటలేంటి?

ఏయ్. . . . పిల్లలూ. . . . పోండ్రా మీరందరూ. . . .

అని తిడుతూ కిట్టు రెక్క పట్టుకుని చటుక్కున చంకనేసుకుని, గబగబా ఇంటివైపు నడక సాగించింది.

తెల్లవారింది. . . . .

కిట్టు ఇంకా నిద్ర నుండి లేవలేదు. . . .

ఇంతలో 'శేఖర్' గాడు వచ్చాడు . . . . . శేఖర్‌గాడు కిట్టుకి బంధువు. . . కిట్టు ఇంటి పక్కనే వాడి ఇల్లు.

కిట్టుని కుదుపుతూ ' ఒరే. . . . కిట్టూ లేవరా' అన్నాడు శేఖర్. కళ్ళు నులుముకుంటూ ఏంట్రా ? అన్నాడు కిట్టు. . . లేవరా అన్నాడు శేఖర్. 'ఓ సంగతుంది. . . . . నువ్వొస్తే చూపిస్తా. . . . చూద్దువుగాని' అన్నాడు శేఖర్.

కిట్టు ఉత్సాహంగా లేచి, ' నడు. . . ఎల్దాం. . . 'అన్నాడు.

వెళ్తూ వెళ్తూ గోడకి ఆనించిన ఇనుప రింగు, ఒక అడుగు అడుగున్నర వ్యాసం ఉన్నది (ఈ ఇనుప రింగుని ఎడ్లబండి చక్రానికి మధ్యలో, గట్టిగా చక్రాన్ని పట్టి ఉంచేందుకు వాడతారు.) తీసుకుని దాని పక్కనే పెట్టిన తాటి కమ్మతో చాకచక్యంగా తోసుకుంటూ, శేఖర్‌తో కలిసి ఊళ్లోకి వెళ్లాడు కిట్టు.

ఇద్దరూ కలిసి ఒక ప్రదేశానికి వెళ్లారు. . . .

అక్కడ ఒక చిన్న మైదానం ఉంది. చాలా మంది పిల్లలు ఉన్నారు. అందరూ ఉత్సాహంగా ఉన్నారు. . .
ఏముందిరా ఇక్కడ ? అని శేఖర్‌ని అడిగాడు కిట్టు. . .
శేఖర్ కిట్టుని ఇంకా దగ్గరకు తీసుకెళ్లాడు.
అక్కడ నేల మీద నిలువుగా ఒక 'అరటి బోదె' , దానిపై అడ్డంగా ఇంకో అరటి బోదె, ఒక ఫ్యాన్‌లాగా నిలబెట్టబడి ఉన్నాయి. అవి రెండూ కిందపడిపోకుండా మధ్యలో బలమైన 'గునపం' లాంటిది ఉంది.
అడ్డంగా ఉన్న అరటి బోదె పై ఆ చివరా, ఈ చివరా పిల్లలు కూర్చొని ఉన్నారు.
ఇద్దరు పెద్దవాళ్లు ఆ అడ్డుబోదెను ఫ్యాన్‌లాగా తిప్పుతున్నారు.
పిల్లలు కింద పడిపోకుండా వాళ్లే చూసుకుంటున్నారు.
పిల్లలంతా నేను. . . . నేను. . . అని ముందుకు వస్తున్నారు.
కిట్టు కూడా ముందుకుపోయి. . . నేను. . . నేను. . . అన్నాడు.
అక్కడున్న పెద్దవాళ్లలో ఒకడు కిట్టువైపు చూశాడు.
'పొట్టి బాలుడు, నల్లటి దేహచ్ఛాయ, పుల్లలాంటి కాళ్ళూ చేతులూ, చట్టి ముక్కుతో ఒంటిమీద చొక్కా లేకుండా, జారిపోతున్న నిక్కరును అప్పుడప్పుడూ పైకి లాక్కుంటున్న కిట్టు. . . . ' కనిపించాడతనికి.
కిట్టుని చూడగానే ముఖం చిట్లించి, అరే. . . ఇందాకే కదా నువ్వు ఎక్కావు ?
మళ్లీ మళ్లీ వస్తే ఎలా ? ఇంకొళ్లకి ఛాన్స్ ఇవ్వాలి కదా ? అన్నాడు.
'లేదండీ. . . లేదు. . . .
నేను ఇప్పుడే వచ్చాను,
ఒరే. . . శేఖర్ . . . నువ్వు చెప్పరా. . . .' అన్నాడు కిట్టు.
శేఖర్ కిట్టుకి వత్తాసు పలికాడు.
సరే. . . కాస్సేపాగండి అన్నాడు పెద్దవాడు.
కాసేపటికి కిట్టుకి, శేఖర్‌కి ఛాన్స్ వచ్చింది.
ఆ అరటి బోదెపై కూర్చొని, గిర గిరా తిరిగేటప్పటికి కిట్టుకి ఎంతో ఆనందం కలిగింది.
ఈ సారి తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు శేఖర్‌గాడు కిట్టుని అడిగి, ఇనుపరింగు తీసుకున్నాడు. ఇద్దరూ కలిసి మాట్లాడుకుంటూ ఇంటి ముఖం పట్టారు. ఇంటి వరకూ రాగానే శేఖర్ వెళ్లి రెండు 'కచ్చిక' ముక్కలు తెచ్చాడు.
కచ్చిక ఎలా వస్తుందంటే . . . .
పేడతో 'పిడకలు' చేసి, ఆ పిడకల్ని కాల్చగా మిగిలినదే 'కచ్చిక' . ఈ 'కచ్చిక'ని అరచేతి పై వేసి రుద్దితే 'పౌడర్' అయిపోతుంది. ఆ ' పొడుం' నే కాల్గేట్ టూత్ పౌడర్‌గా భావించి దానితో పళ్ళు తోముకుంటారు.
దాంతో ఇద్దరూ పళ్ళు తోముకున్నారు.
ఒక తాటి ఆకును చక్కగా 'టంగ్ క్లీనర్' సైజులో కత్తిరించుకుని దగ్గర్లో ఉన్న బావి దగ్గరకు పోయి ముఖం కడుక్కున్నారు. అక్కణ్ణుంచి బయల్దేరి, దాదాపు ఊరి చివరకు చేరుకున్నారు. అక్కడ ఎక్కువ జన సంచారం ఉండదు. చెట్లు చేమలు, పొదలు, ఒక నీటి గుంట ఉంటాయి. కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఊరివాళ్లకి అనువైన ప్రదేశమది.

ఇద్దరూ కలిసి మొగలి పొదలున్న చోటికి వెళ్లారు. మొగలి పొదలు, దట్టంగా కాక పల్చగా ఉండి, చెట్టులాగా ఎత్తుగా కొమ్మలు కలిగి ఉన్నాయి.

రెండు ఎదురు బదురుగా ఉన్న చెట్లను ఎంచుకుని వాటి పైకి ఎక్కి చెరో కొమ్మ మీద కూర్చుని కబుర్లు చెప్పకుంంటూ 'టాయిలెట్' పని కానిచ్చారు.

ఈలోపు దూరంగా ఎవరో తెలిసిన మనిషి వస్తున్నట్లు కనిపించాడు.

కిట్టు 'కనిపెట్టి, ఒరే . . . . శేఖర్ మీ నాన్నొస్తున్నాడురా ' అన్నాడు.

ఇద్దరూ గబగబా చెట్టుదిగి, నీటి గుంట దగ్గరకు పోయి, శుభ్రం చేసుకుని, పరిగెత్తుకుంటూ 'చెరువు' దగ్గరకు వచ్చారు.

అక్కడ కిట్టు వాళ్ల అన్నయ్య చెరువులో స్నానం చేస్తున్నాడు. చెరువు గట్టుపైన సగానికి కట్ చేసిన లక్స్ సబ్బు ఉంది. సబ్బు తొందరగా అరిగిపోకుండానూ, ఉన్నదానిని ఎక్కువ రోజులు వచ్చేలా చేసిన ఏర్పాటు అది.

కిట్టు, శేఖర్ అదే సబ్బుతో చెరువులో స్నానం చేసేశారు. అక్కడున్న టవల్‌తో ఇద్దరూ తుడుచుకుని ఇంటికి బయలుదేరారు.

బడికి వేళ్లేది ఉందా ? లేదా ?... పొద్దున్నే వెళ్లి, ఇప్పడా వచ్చేది. . . .

అంటూనే కిట్టు వాళ్ల నాయనమ్మ కిట్టుకీ, అన్నయ్యకీ ఉప్మా పెట్టి, ఒక స్టీలు గ్లాసు నిండా కాఫీ పోసి ఇచ్చింది.

కొద్దిగా ఉప్మా తింటూ, కొద్దిగా కాఫీ తాగుతూ, అన్నదమ్ములు అల్పాహారం కానిచ్చారు.

చొక్కా వేసుకుని, పుస్తకాల సంచి తగిలించుకుని బడికెళ్ళాడు కిట్టు.

కిట్టు స్కూలు ఇంటికి చాలా దగ్గర. స్కూలు గోడపై ఒక చెక్కబోర్డు ఉంది. ఆ బోర్డు మీద

"ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,

పెన్నాడ అగ్రహారము,

పశ్చిమ గోదావరి జిల్లా. . . " అని రాసి ఉంది.

కిట్టు వాళ్ల అన్నయ్య కిట్టు కంటే ఒక క్లాసు ఎక్కువ. ఊళ్ళో బళ్ళోకి వెళ్తాడు. ఊళ్లో బడి అని పేరెందుకొచ్చిందంటే, అది ఊరి మధ్యలో ఉంటుంది గనుక. ఎక్కువ మంది మేష్టార్లు, ఎక్కువ క్లాస్ రూంలు ఉంటాయి.

కిట్టు బళ్ళోను, ఊళ్ళో బళ్లోనూ ఐదో క్లాసు వరకే, కానీ కిట్టు బళ్లో ఇద్దరే మాష్టార్లుంటారు. మొదటి మాష్టారు పేరు 'పంతులమ్మ గారు' ఈ పంతులమ్మగారి అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు.

తెలుసుకోవాలని ఎవరూ అనుకోరు కూడా. . . . ఆ అవసరం కూడా లేదు.

పంతులమ్మగారు. . . . పంతులమ్మగారు . . . అని పిల్లలు, గ్రామస్థులు ఆవిడను పిలుచుకుంటారు. ఆవిడను చాలా గౌరవంగా చూసేవారు.

రెండో మాష్టారు. . . మాత్రం మారుతూ ఉంటారు.

ఒకసారి ఒక 'లేడీ టీచర్' వచ్చింది. . . . ఆమె పేరు 'కొత్త పంతులమ్మ' అని పెట్టుకున్నారు.

ఆమె వెళ్లిన తర్వాత 'సత్యం' మాష్టారు, ఆ తర్వాత 'మూర్తి' మాస్టారు అలా. . . .

అదేంటోగానీ పంతులమ్మగారు మాత్రం మారరు, రెండో మాస్టారు మాత్రమే మారుతుంటారు.

కిట్టు తల్లిదండ్రులిద్దరూ గవర్నమెంటు ఉద్యోగస్తులే. ఈ ట్రాన్స్‌ఫర్ల గొడవల్లో పిల్లల్ని ఎన్నిసార్లు అటూ ఇటూ మారుస్తాములే అని, తాత నాయనమ్మల దగ్గర పిల్లల్ని ఉంచేసారు. ఎప్పుడన్నా సెలవుల్లో వచ్చి పిల్లల్ని చూసుకుంటుంటారు.

కిట్టుని కూడా ఊళ్లో బళ్లో చేరుస్తానన్నారు వాళ్ల నాన్నగారు. కానీ కిట్టుకి ఇంటి దగ్గర బడి అలవాటై పోయింది. వేరే బడి, అందునా ‘ పేద్దబడి ’ అంటే భయం వేసి, ఏడ్చి, గోల చేసి ఊళ్లో బళ్ళోకి వెళ్లలేదు. కిట్టు బడిలో కూర్చున్నాడు.

పంతులమ్మగారు లెక్కల పాఠం మొదలెట్టారు. కూడికలు, తీసివేతలు, భాగహారాలు, అంతకుముందు చెప్పినవే కొద్దిపాటి అంకెల మార్పుతో మళ్లీ చెప్పారు. రెండు లెక్కలు బోర్డుమీద రాసి,

మీ అంతట మీరు చేసి నాకు చూపించండి. . . అన్నారు. బోర్డు మీద చూసి పలకమీద రాసుకున్నాడు కిట్టు.

‘పలక’ ని ఇంగ్లీష్‌లో ‘స్లేట్’ అంటారు. ఇప్పుడసలు పిల్లలు ‘పలక’లే వాడటం లేదు. వాడినా అవి చాలా ‘మోడర్న్’ పలకలు.

కిట్టువాడే పలకకి చుట్టూ చెక్క బోర్డరు ఉండి, ఆ మధ్యలో పలుచగా ఉండే ‘పలక’ అమర్చబడి ఉంటుంది. కింద పడితే పలక పగిలిపోతుంది.

దానిపై ‘కణికె’ తో రాయాలి. ఆ ‘కణికె ’ కూడా పలకతో చేసినదే. . . . సన్నగా, పొడవుగా ఉంటుంది. దాన్ని ‘ బలపం’ అంటారు.

ఈ పలకలతో పిల్లలు కొట్టుకుంటూ ఉంటారు. పలకతో నెత్తిమీద కొడితే, ఆ పలక పగిలి, దాని చుట్టూ ఉన్న చెక్క బోర్డరు మెడ చుట్టూ హారం లాగా ఉండిపోతుంది. దెబ్బతిన్నవాడికి హాని కలగకుండా ఈ హారాన్ని తియ్యడం ఒక పెద్ద పని.

మాస్టార్లు, వీలున్నంతవరకు ఈ పనిని తమ భుజస్కంధాలపై వేసుకుని, ఏడ్చేవాడిని ఊరుకోబెడుతూ, కార్యాన్ని సాధించేవారు.

బలపాలది ఇంకో కథ . . . .

చెవిలో బలపం దూర్చుకొనే వాడొకడు, ముక్కులో పెట్టుకుని, ఊపిరాడ్డంలేదని గోలపెట్టేవాడొకడు, బలపాలు తినేసేవాడొకడు,

ఇలా రకరకాల గొడవలు. . . . గొడవకి తగ్గ మందు కనిపెట్టడం మాస్టారి వంతు.

లోకల్‌గా ఉన్న ‘ ఆరెంపీ ’ డాక్టర్ని పిలిచి, జాగ్రత్తగా ముక్కులోనో, చెవిలోనో దూరిన బలపాలను తీయించడం, బలపాలు తిన్నవాణ్ణి ‘బెత్తం’ తో కొట్టడం. . లాంటి అదనపు బాధ్యతలు మాస్టార్లు స్వీకరిస్తూ ఉంటారు.

పంతులమ్మగారిచ్చిన లెక్కలు కిట్టుకి అర్థంకావడం లేదు. . . ఎలా చేయాలో చేతకావడం లేదు.

ఈలోపు పంతులమ్మగారు ఇంకో టీచరుతో బాతాఖానీలో పడ్డారు.

లెక్కలు చేసిన పిల్లలు ఒక్కక్కరే పంతులమ్మగారి దగ్గరకు వెళ్లి పలకలు చూపిస్తున్నారు. ఆవిడ మాటల్లోనే ఉండి టిక్కు పెట్టి పంపిస్తున్నది.

ఒక టిక్కు పెట్టిన పలకమీద ఉన్నది యథాతథంగా కాపీ కొట్టి, తీసుకువెళ్ళాడు కిట్టు.

మాటల్లోనే ఉన్న పంతులమ్మగారు 'ఇంటూ' కొట్టారు. మళ్లీ వెనక్కి వచ్చి, ఎవడికి టిక్కు వచ్చిందో వాడితోనే లెక్క చేయించి తీసుకువెళ్లాడు కిట్టు. ఈసారి కూడా ఇంటూనే. .

ఎందుకిలా జరుగుతోంది ? కిట్టుకి ఏ మాత్రం అర్థంకావడంలేదు. . . కిట్టు లెక్కల్లో 'వీక్' అని పంతులమ్మగారికి తెలుసు. అందుకనే చూడకుండానే ఇంటూ మార్కు పెట్టిందావిడ.

ఈ విషయం అర్థం చేసుకోవడానికి కిట్టుకి కొన్ని సంవత్సరాలు పట్టింది. . . .

పంతులమ్మగారి బాతాఖానీ అయిపోయింది. మళ్లీ ఈ లోకంలోకి వచ్చిందామె. . .

కిట్టు పలక చూసి, 'ఎవడు రాసాడురా ఇది' అని అడిగింది. వెంటనే రాసినవాడు భయపడుతూ చెప్పేశాడు.

"నా అంతట నేను రాయలేదండి. . .  కిట్టు రాయమని అడిగితేనే రాసాను" అన్నాడు.

"వాడితో రాయిస్తావురా ?" అంటూ బెత్తంతో కిట్టుకి నాలుగు దెబ్బలు వడ్డించారు పంతులమ్మ గారు.

ఆ తర్వాత. . . .

"ఏంట్రా. . . నువ్వు, శేఖర్‌గాడు, చెట్టుమీద తప్ప అందర్లాగా నేలమీద టాయిటెట్‌కి వెళ్లరేంట్రా అని ఇంకో నాలుగు బెత్తం దెబ్బలు తగిలించింది.

ఈ సంగతి పంతులమ్మగారికెలా తెలిసిందో కిట్టుకి అంతుబట్టలేదు."

* * * * *

కిట్టు చిన్నతనంలో ఇప్పట్లోలాగా టీవీలు, వీసీయార్‌లు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్ గేమ్‌లు, ప్లే స్టేషన్లు లేవు. ఐమాక్స్ లాంటివి సమస్యే లేదు.

సినిమా చూడాలంటే పక్కనే మైలున్నర దూరంలో ఉన్న 'చింగిచ్చం' లో ఒక టూరింగ్ టాకీస్ ఉంది. అక్కడికి వెళ్లాలి. చింగిచ్చం ఊరు అసలు పేరు 'శృంగవృక్షం'. అంత స్పష్టంగా పలకలేని కిట్టు నాయనమ్మ సింపుల్‌గా చింగిచ్చం అనేది.

ఆ టూరింగ్ టాకీస్‌కు బలమైన గోడలు ఉండవు. నేల, బెంచీ, చెక్క అనే మూడు తరగతులుంటాయి. నేల ఖరీదు నలభై పైసలు. ఇసుకపోసిన నేలపై తెరకు దగ్గరగా కూర్చుని చూడాలి.

ఆ తరువాత బెంచీ . . . .

బెంచీ ఖరీదు నేలకంటే ఎక్కువ, డెభ్భై అయిదు పైసలు. . . రోడ్డు పక్క టీ కొట్లలో వేసేటటువంటి బెంచీలుంటాయి.

ఆఖర్న కుర్చీ. . . .

'హ్యాండిల్స్' ఉన్న చెక్క కుర్చీలు గానీ, మడతపెట్టే ఇనుప రేకుతో చేసిన 'గాడ్రెజ్' కుర్చీలు గానీ, వేస్తారు. . . దాని ఖరీదు రూపాయి పావలా.

కిట్టు, కిట్టు స్నేహితులు, ఎవరో ఒక 'పెద్దవాడిని' తోడుగా తీసుకుని, రెండో ఆటకి వెళ్లేవాళ్లు. ఒక్కోసారి తాతయ్య నాయనమ్మలతో కలసి వెళ్లేవాళ్లు.

రెండో ఆట అంటే సెకండ్ షో. . . .

కొంచెం ముందుగానే పోయి, మొదటి ఆట ఎప్పుడైపోతుందా అని ఎదురు చూసేవాళ్లు. మొదటి ఆట అయిపోయిందనడానికి గుర్తుగా. . .

హే. . . కృష్ణా. . . ముకుందా. . . . మురారీ. . .

జయ కృష్ణా ముకుందా మురారా. . .

జయ గోపాల కృష్ణా ముకుందా మురారీ. . .

అనేపాట వేసేవారు. . . . .

అమ్మయ్య. . . . . అయిపోయిందిరా. . . . నడవండిరా. . . . .

అని ఆతృతతో పరుగులు తీసి నేల టికెట్టు కొనుక్కుని లోపలికి వెళ్లేవాళ్లు.

సినిమా వేసే ముందు న్యూస్‌రీళ్లని వేసేవారు. ఆ న్యూస్‌ని చాలా మంది ఇష్టపడే వాళ్లు. కిట్టు నాయనమ్మ న్యూస్‌రీళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ మిస్సవకుండా చూసుకునేది.

సినిమా మధ్యలో ఒకోసారి కరెంట్‌పోయేది.

వెంటనే టూరింగ్ టాకీసువాళ్లు రంగంలోకి దిగి, జనరేటరుతో గంటసేపు యుద్ధం చేసేవారు. ప్రేక్షకులంతా ఆ యుద్ధాన్ని తిలకిస్తూ. . . జనరేటరు బాగవ్వాలని దేవునికి ప్రార్థనలు చేసేవారు. . . జనరేటరు బాగవ్వగానే సినిమా మళ్లీ మొదలయ్యేది.

ఈ గందరగోళంలో కిట్టు, కిట్టు స్నేహితులు బెంచీ తరగతిలోకి జంప్ చేసేవారు. ఒకోసారి పట్టుబడేవాళ్లు కాదు. . . . . . ఒక్కోసారి ఎవరైనా 'స్ట్రిక్ట్ ఆఫీసర్' గేట్ కీపర్‌గా ఉంటే వీళ్లని పట్టుకుని తిట్టి, నేలకి నెట్టేవాడు.

ఇంటర్వల్ సమయంలో అడ్వర్‌టైజ్‌మెంట్‌లు వేసేవారు.

"గోదావరి. . . గల. . గల. . షా. . హి. . . డక్కను .. . ఘుమ. . . ఘుమ. . . షా. . . హి. . . డక్కను సిగరెట్టే తాగండీ".

"చేనుకు చేవ. . . రైతుకు రొక్కం. . . .

ఇఫ్‌కో ఉరువులు వేస్తే పిల్లా. . . . తిరుగులేదు మన పంటకు మల్లా. . . .

ఇలా ఉండేవి అడ్వర్‌టైజ్‌మెంట్‌లు . . . . ."

జగన్మోహిని, సువర్ణ సుందరి, తాతమ్మ కల, శ్రీకృష్ణ పాండవీయం, రంగుల రాట్నం, ఒకటేమిటి ఇలాంటి ఎన్నో చిత్ర రత్నాల్ని తిలకించేవాడు కిట్టు.

"కంప్యూటర్ గేములు", "ప్లే స్టేషన్ల" బాబుల్లాంటి ఆటలు ఆడుకునేవారు కిట్టు, కిట్టు స్నేహితులు.

తాటి చెట్టు నుండివచ్చే ముంజ కాయల్ని చక్కగా కట్ చేస్తే చక్రాల్లాగా అవుతాయి.

రెండు ముంజ కాయల్ని కట్‌చేసి, ఆ రెండింటికీ సరిగ్గా మధ్యలో ఒక చిన్న కర్రతో కలిపితే, జిమ్‌లో కనిపించే 'డంబెల్' లాగా అవుతుంది. ఒక పొడవాటి 'పంగల కర్ర' తో ఆ మధ్యలోని కర్రని తోస్తే చక్రాలు ముందుకు పరిగెడతాయి. ఆ చక్రాల్ని తోసుకుంటూ 'స్పీడు'గా పరిగెడుతుంటే కలిగే ఆనందం వర్ణనాతీతం.

ఎదుటివాడి చక్రాల్ని తన చక్రాలతో గుద్దించి, వాడి చక్రాల్ని ఊడగొట్టిన వాడిని 'ఫార్ములా కార్' రేస్‌లో నెగ్గిన వాడంత గొప్పగా చూసేవారు.

'నల్లటి బంక మట్టిని నీటిలో నానబెట్టి, చపాతీ పిండిలా తయారు చేసి, దానితో రకరకాల సైజుల్లో 'గూడు బండి', 'ఎడ్లబండి' తయారుచేసి, దానికి 'మట్టి'తోనే చక్రాలు చేసి, అమర్చి, ఎండబెట్టి, గట్టిబడిన తర్వాత దానికి తాడు కట్టి, లాగుతూ ఆడుకునేవారు.'

'గూటీ బిళ్ల లేదా కర్రాబిళ్ల ఇంకో ఆట. . . . . .  దీని నుండే క్రికెట్ వచ్చిందంటారు.

చిన్న కర్ర,, పెద్ద కర్ర ఉంటాయి. పెద్ద కరత్రో చిన్న కర్రని చాకచక్యంగా కొట్టడం 'గొప్పకళ".

కొట్టేటప్పడు టంగు టంగుమని శబ్దం వస్తే, ఆ కర్రల క్వాలిటీ మంచిదన్నమాట.

'కుప్పాట'...లో ఇటుక సైజులో ఉన్న మెత్తటి రాళ్లని కనబడకుండా ఇసుకతో పూర్తిగా నింపి 'కుప్ప' తయారు చేసి, దాని చుట్టూ 'బరి' గీస్తారు. ఆ కుప్పను తన్నుతూ, రాళ్లని బయటపడేలా చేసి, ఇంకా తన్నుతూ, రాళ్లని బరినుంచి బయట పడేయాలి.

ఎవరు ఈ పని ముందుగా చేస్తే వాళ్లకి గొప్ప వస్తుంది.

'తన్నులాట'లో ఎదుటివాడిని తన్ని వెంటనే కూర్చోవాలి. కూర్చున్నవాడిని తన్నకూడదు. అది రూలు.

ఎదుటివాడిని ఎంత స్పీడుగా తన్నేసి, అంతే స్పీడుగా కూర్చోగలిగేవాడు బహునేర్పరి."

"ఈ కుప్పాట , తన్నులాటల  నుండే టేక్వాండో వచ్చి ఉండవచ్చు"

టేక్వాండో అంటే ఏమిటి ? అని ఎవరైనా అడిగితే తన్నులాట అని తప్ప, వేరేమాట చెప్పలేము.

నల్లమట్టిని మెత్తగా చేసి గోళీల్లాగా తయారుచేసి, ఎండబెట్టి, గట్టిబడ్డాక 'ఉండేలు' (ఇంగ్లీష్‌లో కెటాపుల్ట్ అంటారు) లో పెట్టి, లాగి కొడుతూ కాకుల్ని భయపెడుతూ తిరగడం ఒక సరదా.

గోళీలాటలో గోళీని వంచిన వేలిలో ఇరికించి, ఇంకో వేలితో దానికి 'సపోర్టు' ఇస్తూ గురిచూసి ఇంకో గోళీని కొట్టాలి.

దూరంగా ఉన్న గోళీని కొట్టినవాడు 'గొప్పవాడు', కొట్టిన దెబ్బకి గోళీ పగిలిపోతే 'అబ్బ ఏం కొట్టాడురా. . . ' అనేవారు.

'గచ్చు' పై గానీ, మట్టినేల మీదగానీ సుద్దతో మూడు పలకలుగా (ఇంగ్లీష్‌లో స్క్వేర్) గీతలు గీసి వాటిపై 'పిక్క' (ఏదయినా గింజగానీ, చిన్నరాయి ముక్కగానీ, "చిన్నపుల్లగానీ ఉంచి,వాటిని తెలివిగా కదుపుతూ 'దాడి' చేసి, ఎదుటి వాడి 'పిక్కల్ని' సొంతం చేసుకోవాలి.) ఇదే ' దాడి ' ఆట.

'అష్టచెమ్మ'లో తెలుగు క్యాలెండర్‌లో లాగా గడులు గీసి, వాటిల్లో (పిక్కల్ని) చింత గింజలు గానీ, సపోటా గింజల్ని గానీ . . .  వేసిన 'పాచిక' (ఇంగ్లీష్‌లో డైస్) కు వచ్చిన సంఖ్య ప్రకారం కదుపుకుంటూ వెళ్తారు... అష్ట అంటే ఎనిమిది.. అష్ట పడితే మన పిక్క ఎనిమిది గడులు దాటాలి. చమ్మ పడితే నాలుగు దాటుతుంది. ఎవరి పిక్క ముందుగా గడులన్నీ దాటితే వాళ్లు నెగ్గినట్లు. . .

సీతాఫల గింజల్ని గుండ్రంగా గీసిన గీత మధ్యలో వేసి, ఇంకో గింజ కంగకుండా (కదలకుండా) చూపుడు వేలితోగానీ, మధ్యవేలితోగానీ నేర్పరితరంగా బయటకు లాగాలి. వేరే గింజ కదిలితే లాగేవాడు ఓడిపోయినట్లు. మళ్లీ ప్రయత్నించాలి.

గవ్వలాట, లేక కచ్చకాయ ఆటలో ఒక గవ్వని పైకి విసిరి, అది కిందపడేలోగా నేలమీద ఉన్న గవ్వను దానికి చేర్చి పట్టుకోవాలి ఒకే చేతితో.

ఈసారి రెండు గవ్వలు ఎగరవేసి, ఆ రెండూ కిందపడేలోగా నేలమీద ఉన్న మూడో గవ్వని చేర్చి మూడూ ఒకే చేతితో పట్టుకోవాలి.ఇలా సంఖ్య పెరుగుతూ ఐదో, ఆరో గవ్వలతో ముగుస్తుంది.

ఈ ఆటలో మళ్లీ రకాలున్నాయి.

ఆడపిల్లలు, మగపిల్లలు ఈ ఆట ఆడినాగానీ సాధారణంగా ఆడపిల్లలు బాగా ఆడతారీ ఆట.

ఇవికాక కబడ్డీ, బంతి ఆట, ఖో ఖో, బ్యాట్ - బాల్ ఆటలు కూడా ఆడేవారు.

కిట్టు , స్నేహితులు కలసి తోటల్లోకి వెళ్లేవాళ్లు.

రాలిన మామిడికాయలు, మామిడి పండ్లు, జీడి కాయలు, ఏరుకునేవారు.

పొదుల్లోని దొండపండ్లు, అక్కడక్కడ దొరికే బుడబుచ్చకాయలు (ఇంగ్లీష్‌లో రాస్ప్ బెర్రీ), ఉసిరికాయలు, నేరేడు పళ్ళు, రేగుపళ్ళు, సీమచింతకాయలు, చింతకాయలు, జామకాయలు మొదలైనవి తింటూ తిరిగేవారు.

ఈ రోజుల్లో పిల్లలకి బయట ఆడే ఆటలు తక్కువైపోతున్నాయి. ఎంతసేపూ చదువు.

ఖాళీ ఉంటే కంప్యూటర్ గేమ్‌లు. . .

అదేదో స్కూలో, కాలేజీనో. . . .

అందులో పిల్లవాడిని చేర్పించడానికి వెళ్లిన తల్లిదండ్రులు ఆ సంస్థవాళ్లని అడిగారట. . 'మీ సంస్థలో ఆటస్థలం ఉందా అని. . ?'

ఆ సంస్థవాళ్లు ఈ తల్లిదండ్రుల్ని మహాపాపం చేసిన పాపాత్ముల్ని చూసినట్లుగా చూసి, . . . 'అలాంటి వెధవ్వేషాలు మా దగ్గర చదువుకునే స్టూడెంట్లని వెయ్యనివ్వం'. . . 'చదువు. . . చదువు. . . అదే మాధ్యేయం' . . . 'మీకు ఆటలు కావాలంటే అవి ఉన్న పనికిమాలిన సంస్థలు చాలా ఉన్నాయి. అక్కడకు పొండి. . . మాదగ్గరకు ఎందుకొచ్చారు ?' అని కసిరి విసిరేశారంట ! !

అలాగే ఇప్పటి పిల్లలు ప్రకృతి నుండి వచ్చే పండ్లు, ఫలాలు తక్కువగానూ, పిజ్జాలు, బర్గర్లు ఎక్కువగానూ వాడుతున్నారు. పిల్లలకు ఆటపాటల్ని, మంచి ఆహారపు అలవాట్లని నేర్పించి, తల్లిదండ్రులు, సమాజం ప్రోత్సహించవలసి ఉంది.

మూసపోసినట్లుగా . . . . అందరూ ఏదో ఒకటి చేస్తున్నారు. . . మనం కూడా అలాగే చేద్దాం. . . అనుకోవడం మంచిది కాదు.

కిట్టు ఆరో తరగతిలో చేరే సమయం వచ్చింది. పెన్నాడ అగ్రహారంలో ఆరో తరగతిలేదు. చింగిచ్చంలో ఉంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. అందులో చేర్చారు కిట్టుని.

రోజూ మైలున్నర పోనూ, మైలున్నర రానూ. . . . . నడుచుకుంటూ వెళ్లి రావడమే. . . .

మధ్యాహ్నం ఇంటికి రావడం కుదరదు కాబట్టి, క్యారేజీ తీసుకువెళ్లేవాళ్లు.

ఎర్రరంగులో ఉన్న సత్తు క్యారేజీ (ఇంగ్లీష్‌లో జర్మన్ సిల్వర్) ఒక చేతిలో, భుజాన్న పుస్తకాల సంచితో కిట్టు, కిట్టు వాళ్ల అన్నయ్య ఇతర స్నేహితులు గ్రూపుగా వేళ్లేవారు.

పెన్నాడ ఊరి పొలిమేర దగ్గర శ్మశానం, అది దాటాక, రాంపెల్లి చెరువు (రాంపెల్లి చెరువు దగ్గర ప్రమాదాలు జరుగుతాయి అని అనుకునేవారు) తర్వాత అట్టల ఫ్యాక్టరీ, రైస్ మిల్లులు, కాలువ, కాలువ పక్కన గుడి, టూరింగ్ టాకీసు, ఆపై స్కూలు. . . .

ఇలా రోజూ కబుర్లు చెప్పకుంటూ ఎండ, వాన లెక్కచెయ్యకుండా నడుస్తూ వెళ్లి వస్తుండేవారు.
పెన్నాడ అగ్రహారంలో బయలుదేరగానే, వేణుగోపాలస్వామి గుడి కన్పించేది.
వెళ్తూ వెళ్తూ గుడిలోపలికి వెళ్లి, దండం పెట్టుకుని, పూజారిగారిచ్చిన ప్రసాదం తింటూ ఆనందంగా బయటకు వచ్చేవారు. గుడి ముందు ఎత్తైన అరుగులతో ఒక ఇల్లు ఉండేది.
'సోమరాజు' గారనే పెద్దాయన పెద్దమీసాలతో, తెల్లని మెరిసిపోయే లాల్చీ పైజామాలతో ఠీవీగా ఒక అరుగుపై కుర్చీలో కూర్చొని ఉండేవారు. ఆయనను చూడగానే నమస్కారం చేయాలన్పించేది.
పిల్లలంతా నమస్కారం చేయగానే, ఆయన కూడా ఎంతో వాత్సల్యంగా చూస్తూ, రెండు చేతులతో ప్రతి నమస్కారం చేసేవాడు. రోజూ ఇదొక కార్యక్రమంలాగా ఉండేది.
ఎప్పడయినా వీళ్లకి ఆయన కన్పించకపోతే అయ్యో అనుకునేవారు.
స్కూలుకు వెళ్లడానికి మూడు దారులున్నాయి.
మొదటిది తిన్నగా మెయిన్‌రోడ్‌కి వెళ్లి, అదే దారిలో ఊరిపొలిమేరలు దాటడం, రెండోది, సోమరాజుగారి ఇంటివైపు తిరిగి తిన్నగా ముందుకు వెళ్లి, శ్రీవైష్ణవుల ఇళ్ల మీదుగా మెయిన్ రోడ్‌లో కలవడం.
ఈ శ్రీ వైష్ణవులు ఎక్కువగా బయట కన్పించేవారు కాదు. ఆ దారిన పోతుంటే రకరకాల వాయిద్యాల కమ్మని శాస్త్రీయ సంగీతం విన్పించేది. ఎప్పడన్నా కుతూహలంగా స్నేహితులంతా అరుగు ఎక్కి కిటికీల్లోంచి చూసేవారు. ఒక క్రమపద్ధతిలో కూర్చొని, చిత్ర విచిత్రమైన వాయిద్యాలతో సాధన చేస్తున్న మనుషులు కన్పించేవారు.
ఇక మూడోదారి. . . .
మెయిన్ రోడ్‌కి వెళ్లకుండా దానికి ఆపోజిట్‌గా వెళ్లి, పొలాల వైపు వెళితే రైలు పట్టాలొస్తాయి. ఆ పట్టాల మీదుగా నడుచుకుంటూ స్కూలుకి వెళ్లడం. ఈ మూడోదారికి, ముచ్చటగా "అడ్డరూటు" అనిపేరు పెట్టుకున్నారు స్నేహితులంతా. . . . ఎప్పడన్నా స్కూలు ఎగ్గొట్టాలంటే ఈ " అడ్డరూటు"లో వెళ్లడం, దారిలో రేగుకాయలు, నేరేడు కాయలు కోసుకుంటూ వెళ్లడం, చింగిచ్చం రాగానే అక్కడొక చిన్న రైల్వే బ్రిడ్జి, బ్రిడ్జి క్రింద కాలువ కన్పించగానే ఆగడం, బ్రిడ్జి మీదనుండి కాలువలోకి దూకడం, కాలువలో ఈత కొట్టడం చేసేవారు.
టైమ్ ఎలా గడిచేదో తెలిసేది కాదు.
మధ్యాహ్నం కాగానే క్యారేజీలు తీసి తినడం, మళ్లీ ఈత.. . . . .
ఈ తర్వాత వచ్చిన దారినే అదే పద్ధతిలో ఇంటికి చేరడం. . . . .

* * * * *

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. . .
చింగిచ్చం మెయిన్‌రోడ్‌కి ఆనుకుని ఉంటుంది.
ఉపాధ్యాయులందరూ అంకిత భావంతో విద్య నేర్పిస్తారక్కడ.
మొట్టమొదటి ఉదాహరణ హిందీ మాస్టారు.
ఒక తెలుగు కథతో తన పాఠం మొదలుపెట్టారు.

రాజకుమారుడు. . .  పెద్ద సముద్రం. . . పెద్ద  తిమింగలం. . . ఇలా ఇంట్రస్టింగ్‌గా మొదటివారం గడిచింది. ఎప్పుడెప్పుడు హిందీ క్లాసుకు వెళ్దామా. . .  అని పిల్లలకి అనిపించేటట్లుగా చేశారు. . . . హిందీ మాస్టారు. నెమ్మదిగా 'అ, ఆ, ఇ, ఈ' లతో మొదలుపెట్టి, వత్తులు, గుణకారాలు, మెల్లగా చిన్నచిన్న పదాలను ఎలా కూర్చాలి, ఎలా చదవాలి అనేది అంచెలంచెలుగా విద్యార్థులకే తెలియకుండా వాళ్ల బుర్రల్లోకి ఎక్కించేవారు.

అయితే ఆయన పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం కోరుకునేవాడాయన. అదేమిటంటే 'ఎవడికైనా సరే, తొంభై కంటే తక్కువ మార్కులు వస్తే, తాట తీస్తాను' అనేవాడు.

'దేవులపల్లి రామకృష్ణ శాస్త్రిగారు' తెలుగు పండితులు.

ఒకరోజు ఆయన క్లాసులో,  నేలమీద కూర్చున్న కిట్టు రెండు రాళ్లను తీసుకుని, ఆ చేతినుండి ఈ చేతికి మారుస్తున్నాడు. ఇది చూసిన వాళ్లెవరికైనా అనుమానం వస్తుంది. వీడు 'వినడం' లేదు సరిగ్గా అని. . . . .

కానీ కిట్టుకి మాస్టారి సౌమ్యత, సరళత, బోధించే విధానం ఎంతగానో నచ్చాయి. జాగ్రత్తగానే వింటున్నాడు. గురువుగారి అనుమానం తీర్చుకోవడానికి. . . ఆయన కిట్టుని ఉద్దేశించి అన్నారు. . . .

'ఏదీ నేను ఇందాక చెప్పిన పద్యం ఒకసారి చెప్ప ?'

కిట్టు, తనకు తెలియకుండానే , ఆయనను అనుకరిస్తూ, ఆయన పద్యం ఎలా చెప్పారో, రాగయుక్తంగా ఎలా ఆలపించారో, అలాగే పద్యాన్ని ఆలాపించాడు. గురువుగారు చాలా ప్రసన్నమైపోయారు.

అప్పటి నుండీ కిట్టుని 'తంబి' అని పిలవడం మొదలుపెట్టారు.

ఈ చిన్న సంఘటన కిట్టు బుర్రలో ఎక్కడో ముద్ర పడిపోయింది.

**ఆ చిన్న సంఘటనే భవిష్యత్‌లో కిట్టు తీసుకోబోయే కీలక నిర్ణయానికి నాంది పలికింది.**

చింగిచ్చం హైస్కూల్‌లో ప్రతీ విద్యార్థీ ప్రతీ సబ్జెక్టుకి నోట్స్ రాయాలి. మాస్టార్లు దగ్గరుండి గంటలకొద్దీ నోట్స్ రాయించేవారు. రాశారా. . . లేదా. . . ? అని పరిశీలించి, సంతకాలు పెట్టేవారు.

**'రాయడం' అనేది చాలా ముఖ్యవిషయం.**

రాస్తూ ఉంటే చదివినట్లు కూడా. . . మనకు తెలియకుండానే గుర్తుండిపోతుంది.

**ఇలా నోట్సు రాయడం కిట్టుకి భవిష్యత్‌లో  ఎంతో మేలు చేసింది.**

విద్యార్థులతో నోట్సు రాయించమే కాదు, క్లాస్ బయటకు వీళ్లని తీసుకెళ్లి,  ప్రశ్నలు, సమాధానాలు, ఒక విద్యార్థి ఇంకో విద్యార్థికి అప్పజెప్పేలా చేసేవారు. పదాలు, వాటి అర్థాలు రాయించి క్లాసులో అందర్నీ వరసగా అడిగేవారు.

సైన్స్ మాస్టారు, ఇంగ్లీష్ చాలా స్టైల్‌గా మాట్లాడేవారు.

ఒకరోజు కప్పని కోసి, ఓపిగ్గా అన్ని క్లాసులకి తిరిగి దాని గురించి వివరించారు.

ఆ తర్వాత విద్యార్థులు ఆ విషయం మాట్లాడుకుంటూ

'అరే ! సైన్సు మాస్టారు కోసిన కప్పని మళ్లీ తిరిగి కుట్టేశారంట. . . .

అది కళ్లు తెరిచి చూసి, లేవడానికి ప్రయత్నించి మళ్లీ పడిపోయిందంట. . . . .'

కాసేపటికి లేచి, చెరువులోకి దూకి ఈదుకుంటూ వెళ్లిపోయిందంట " అని చెప్పుకున్నారు.

కిట్టుకి లెక్కలంటే  ముందు నుండీ భయం.

స్కూల్లో కూడా హోం వర్కు చేయకపోవడం, లెక్కల మాస్టారితో తిట్లు తినడం షరా మామూలే.

మాస్టారు బాగా చెప్పినాగానీ, విద్యార్థి బుర్ర రెడీగా లేనప్పుడు చెప్పిన విషయాలు బుర్రకెక్కవు.

కిట్టుకి కథలంటే చాలా మక్కువ.

చందమామ, బాలమిత్ర, , బొమ్మరిల్లు వంటి కథల పుస్తకాలు చదువుతూ ఉండేవాడు. ఇంటి దగ్గర ఉన్న అంగట్లో పొట్లాలు కట్టడం కోసం తూకం వేసిన వార పత్రికలు, న్యూస్ పేపర్లు, ఆ అంగడి అరుగు మీద కూర్చొని చదువుతుండేవాడు కిట్టు.

'ఆంధ్రప్రభ పత్రిక ' లోని ' బాలప్రభ శీర్షిక ' న చక్కని కథలు వేస్తుండేవారు. అవి ఎంతో ఇష్టంగా చదివేవాడు కిట్టు. సరుకులు కొనుక్కెళ్ళడానికి  వచ్చిన  గ్రామస్థులు ఒకళ్ళతో ఒకళ్ళు అనుకుంటూ ఉండేవాళ్ళు 'ఈ పిల్లాడు ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం పట్టుకుని చదువుతూనే ఉంటాడమ్మా' అని.

పక్కనే ఉన్న 'గొరగనమూడి'కి నడిచివెళ్లి , అద్దె పుస్తకాలు తెచ్చుకునేవాడు కిట్టు.

మధుబాబు రాసే డిటెక్టివ్ నవలల్లోని హీరో 'షాడో'  గురించి చదువుతూ, ఆశ్చర్యానందాలతో అందులో లీనమైపోయేవాడు. 'డిటెక్టివ్ నర్సన్, డాగర్, టైగర్, కాట్ ' వంటి హీరోలు చేసే అద్భుతాలు చదువుతూ మైమరచిపోయేవాడు. 'బ్లాక్ అండ్ వైట్' కామిక్ పుస్తకాలు దొరుకుతుండేవి. మాంత్రికుడు మాండ్రేక్, టార్జాన్, ఫాంటమ్‌ల సాహసాలు బొమ్మల్తో సహా చదివితే ఎంతో సంతోషంగా ఉండేది కిట్టుకి.

పుస్తకానికి రోజుకి పావలా అద్దె చెల్లించేవాడు.

పాకెట్ సైజులో మందంగా ఉండే కథల పుస్తకాలు వస్తుండేవి. అందులో . . . .   రాజా విక్రమాదిత్యుల వారి కుమారుడు, రాజకుమారుడు విక్రమ్, అతని స్నేహితుడు మరియు మంత్రిగారి కుమారుడు విజయ్‌లు కలిసి చేసే సాహసయాత్రలు, లోయలు, గుట్టల్లో వాళ్లు ఎదుర్కొన్న వింత ఆకారాలు, వాటితో వీళ్లిద్దరూ చేసే ఒళ్ళు గగుర్పొడిచే కత్తియుద్ధాలు కిట్టుకి ఎంతగానో నచ్చేవి.

ఇవన్నీ 'సోది' పుస్తకాలు అని కొట్టిపారేయొచ్చు. ఈ సోది కూడా కనబడని ప్రయోజనాన్ని కలగజేస్తుంది.

ఎలాగంటే. . . .

ఒకచోట కూర్చొని అదే పనిగా చదవడం, అక్షరాల వెనుక కళ్ళని పరుగులు తీయించడం, మనిషికి తెలియకుండానే అలవాటవుతుంది.

**ఈ అలవాటే కిట్టుకి చాలా సహాయకారిగా నిలబడింది.**

ఇతర పుస్తకాలు చదవడం వల్ల ఇంకో ప్రయోజనం కూడా ఉంది.

అదేమిటంటే. . . . .

హైస్కూలులో ఒకరోజు సైన్సు మాస్టారు ఒక ప్రశ్న వేశారు.

"శరీరంలో నల్లదనానికి కారణమయ్యే పదార్థం ఏమిటి ?'

ఇది సిలబస్‌లో ఎక్కడా లేదు. ఈ విషయం మాస్టారికి కూడా తెలుసు. . . .

ముందుగా క్లాసంతటికీ తెలివైన నెంబర్‌వన్ విద్యార్థి వైపు చూస్తూ, వేలితో పైగ చేశారు మాస్టారు. .

ఆ విద్యార్థి సైలెంట్‌గా లేచి నిల్చున్నాడు. . . . సమాధానం లేదు. అలాగే నిలబడమన్నారు మాస్టారు.

తర్వాత ఇంకో తెలివైన విద్యార్థి. . . నిలబడ్డాడు. . . .

ఆ తర్వాత ఇంకో విద్యార్థి. . . . నిలబడ్డాడు. . . . . . .  ఎవర్నీ కూర్చోండి అనడంలేదు మాస్టారు. .. . . . .
ఆడపిల్లల్లో తెలివైన వాళ్లూ, తెలివైన వాళ్లుగా గుర్తించబడ్డ వాళ్లూ ఉన్నారు. వాళ్లు కూడా అందరూ ఒకరికొకరుగా లేచి నిలబడ్డారు. . . . మాస్టారికి పట్టుదల పెరిగింది. . . .
నెక్స్ట్. . . నెక్స్ట్. . . . అంటూనే ఉన్నారు.
వరసగా క్లాసులోని 'యాభై తొమ్మండుగురు' లేచి నిలబడ్డారు. చివరగా గుర్తింపులేని కిట్టూ మిగిలాడు.
ఓ. . .కే. .  సమాధానం ఏమిటంటే. . . . అన్నారు మాస్టారు.
కిట్టులో చలనం వచ్చింది. సార్. . . నేను సార్. . . అన్నాడు.
అరే. .  వీడు చెప్తాడంట. . . వినండిరా. . . వ్యంగ్యంగా అన్నారు మాస్టారు.
మాస్టారి వ్యంగ్యానికి కారణం ఉంది.  కిట్టు క్లాస్‌లో ఏవరేజ్ కంటే తక్కువ. తెలివి అంతంత మాత్రం. ఆకారం. . . రూపం. .  అంతంత మాత్రం. . . .  పిల్లలంతా పకపకా నవ్వారు. క్లాసులో నెంబర్ వన్ నుండి నెంబర్ టెన్ వరకు చెప్పలేనిది. . . వీడేం చెప్తాడు ? అనుకున్నారు అందరూ. . . .
కిట్టు పైకి లేవకుండానే కూర్చొనే 'మెలానిన్' అన్నాడు.
'సరియైన సమాధానం చెప్పేవాడు నిలబడడు, చెప్పలేకపోతే నిలబడతాడు' ఇది క్లాస్‌రూం రూల్..
క్లాసులో నవ్వులింకా ఆగలేదు.
మాస్టారి చెవికి మాత్రం సమాధానం అందింది. ఆయనకు నమ్మబుద్ధి కాలేదు.
ఏంట్రా. . . . . . మళ్లీ చెప్ప ? అన్నారాయన.
కిట్టుకి భయం వేసింది. కొద్దిగా ఆలోచించాడు. తప్పయితే అయ్యింది. . . ఎప్పడూ తినే బెత్తం దెబ్బలే కదా. . . కొత్తగా ఏం పోయింది ?
'మెలానిన్' సార్. . .  అన్నాడు.
'కరెక్ట్' అన్నారు మాస్టారు.
క్లాస్‌లో ఆశ్చర్యం వ్యక్తమయింది. వీడికెలా తెలుసు?
ఆ. . . .  ఏదో అనుకోకుండా ఒక సమాధానం తగిలిందే వీడికి అనుకున్నారు. ఇంతలో బెల్ కొట్టారు. పిల్లలందరూ పాలోమని బయటకు పరుగులుపెట్టారు.
ఇంతకీ విషయం ఏమిటంటే. . .
కిట్టుకి పత్రికలు చదవడం అలవాటు కదా. . .  ఒకరోజు ఆంధ్రప్రభలో 'ఫెయిర్ అండ్ లవ్లీ'  అడ్వర్‌టైజ్‌మెంట్ చూశాడు కిట్టు. అది రాసుకుంటే తెల్లగా అయిపోవచ్చని రాశారు. నల్లగా ఉండే కిట్టుకి తెల్లగా అయిపోవాలని కోరిక. అందుకని శ్రద్ధగా అడ్వర్‌టైజ్‌మెంట్ అంతా పూర్తిగా చదివాడు.
ఆ విధంగా తెలిసింది మెలానిన్ కథ.

* * * * *

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kittugadu+Inter+Fail+IAS+Pass**

* * *